శాప్ కోచ్ అబ్బుకు కోచ్ రిఫ్రెష్ కోర్సు సర్టిఫికెట్



కోర్సు సర్టిఫికెట్ అందుకుంటున్న శాప్ కోచ్ అబ్బు

నర్సీపట్నం : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారు పాటియాలా పంజాబ్‌లో వారం రోజులుగా నిర్వహించిన ఆల్ ఇండియా కోచ్ రిఫ్రెష్ కోర్స్‌లో నర్సీపట్నంకు చెందిన శాప్ కోచ్ కె.అబ్బు సర్టిఫికెట్ అందుకున్నారు. వివిధ రాష్ట్రాల నుండి 26 మంది పాల్గొన్నారు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత చంద్రలాల్ (హర్యానా ఖేలో ఇండియా ఎక్సలెన్సీ మేనేజర్) చేతుల మీదుగా సర్టి ఫికెట్ అందుకున్నారు. కోచ్ అబ్బు ఇప్పటికే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడాకారులను తయారు చేస్తున్నారు. అబ్బు కు నింజాస్ అకాడమి డైరెక్టర్లు వెలగా నారాయణరావు, సుత్తాపల్లి శ్రావణ్, శ్రీకాంత్, ఎన్ఆర్ఐ సురేష్, సీనియర్ కోచ్ శేఖర్ అభినందనలు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుదాం

తిమిరాంలో చెత్త ఊడ్చిన డీఎల్‌డీవో, జెడ్పీటీసీ


తిమిరాంలో చీపురు పట్టి చెత్త ఊడ్చుతున్న డీఎల్‌డీవో మంజులవాణి, జెడ్పీటీసీ సత్యం

దేవరాపల్లి : గ్రామాలలో పరిసరా లను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా సహకరించాలని డీఎల్ డీవో, మండల ప్రత్యేక అధికారి ఎస్.మంజులవాణి సూచించారు. తిమిరాం వారపు సంత ప్రదేశంలో శనివారం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనులను ఆమె పర్యవేక్షించారు. డీఎల్‌డీవోతో పాటు జెడ్పీటీసీ కర్రి సత్యం, స్థానిక సర్పంచ్ రెడ్డి సూర్యనారాయణ చీపురు చేత పట్టి చెత్తాచెదారాలను తొలగించారు. డీఎల్‌డీవో మంజులవాణి మాట్లాడుతూ ఒక్కసారి వినియోగించి విడిచి పెట్టే ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని దుకాణదారులకు సూచించారు. స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ త్రినాథ్ పాల్గొన్నారు.

ఊరూరా నూకాలమ్మ జాతర

- అంబరాన్నంటిన సంబరాలు
- కనుల పండువలా ఘటాల ఊరేగింపు సంబరం

చోడవరం: కొత్త అమావాస్య నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం కన్నుల పండువగా శనివారం జరిగింది. నాగ దేవతల నృత్యాలు, పులివేషాల ప్రదర్శనలు, అమ్మవారి ఉత్సవ గరగల ఊరేగింపులో తీన్‌మార్ డప్పుల మోతలతో అమ్మవారి సంబరం అంబరాన్నంటింది. వేలాది భక్తులతో చోడవరం శ్రీ నూకాలమ్మ అమ్మవారి దేవాలయం కిటకిటలాడింది. ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు, స్థానిక ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల కోసం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చోడవరం జెడ్పీటీసీ మారిశెట్టి విజయశ్రీకాంత్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు దియ్య శంకర్, అఖిల్, దుర్గాప్రసాద్ భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణాన్ని ప్రత్యేక విద్యుత్ సెట్లతో అలంకరించారు. వెంకన్నపాలెం, గైరిపట్నం, బెన్నవోలు, గోవాడ, పీఎస్‌పేట, గంధవరం, ముద్దుర్తి, రాయపురాజుపేట,నర్సాపురం తదితర గ్రామాల్లో నూకాలమ్మ ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.

మాడుగుల రూరల్ : కొత్త అమావాస్త సందర్భంగా కె.జె. పురం చెరకు కాటా ఆవరణలో గల అమ్మవారిని తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మోదమాంబ ఆటో వర్కర్స్ యూనియన్ సభ్యులు భక్తులుకు మజ్జిగను పంపిణీ చేశారు. వీరనారాయణం గ్రామంలో దాడి వారి కళ్లాలు వద్ద వేప చెట్టు వద్ద అమ్మవారిని భక్తులు దర్శించి మొక్కులు చెల్లించారు. ముకుందపురం, వీరవల్లి, చింతలూరు, జి. అగ్రహారం, తదితర గ్రామాల్లో కూడా నూకాంబిక పూజలు ఘనంగా జరిగాయి. రాత్రి కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మాడుగుల : కొత్త అమావాస్య సందర్భంగా నూకాలమ్మ కాలనీలో వెలసియున్న నూకాంబిక అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పండగ సందర్భంగా భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించారు. ఆలయ సమీపంలో టైరుబండ్ల పోటీలు, అన్నసమారాధన, రాత్రికి సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. సర్పంచ్ యడ్ల కళావతి, ఉప సర్పంచ్ వరహాలురావు, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడే శ్రీనాధు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, చిన్నారావు అమ్మవారిని దర్శించుకున్నారు.


మామిడిపల్లిలో నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

నూకాంబికను దర్శించుకున్న మాజీ డిప్యూటీ సీఎం

దేవరాపల్లి : మామిడిపల్లిలో నూకాంబిక అమ్మవారిని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, జెడ్పీటీసీ కర్రి సత్యం, స్థానిక సర్పంచ్ కర్రి సూరినాయుడు, ఎంపీటీసీ పంచాడ సింహాచలం నాయుడు తదితరులు నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. ఎ. కొత్తపల్లిలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, సర్పంచ్ చింతల సత్య వెంటకరమణ నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. కాశీపురం, దేవరాపల్లి తదితర గ్రామాలలో నూకాలమ్మ అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. చింతలపూడి పంచాయతీ శివారు కొత్తూరులో నూకాలమ్మ అమ్మవారి తీర్థం ఘనంగా జరిపారు. జిల్లా స్థాయి గుర్రాల పరుగు పోటీలు ఉత్సాహంగా జరిగాయి.

రోలుగుంట : మండలంలో గల పలు గ్రామాల్లో కొత్త అమావాస్య సందర్భంగా శనివారం నూకాంబిక అమ్మవారి ఉత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే భక్తులు అమ్మవార్ని దర్శించుకొని పసుపు, కుంకుమ సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. జెడ్పీటీసీ పాతల లక్ష్మీరమణమ్మ, ఉప సర్పంచ్ మద్దు తాతబాబు దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. పప్పల వారి కళ్లాల వద్ద గల నూకాలమ్మ ఆలయంలోనూ ఘనంగా పూజలు జరిగాయి. భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.


రోలుగుంట : పాత నూకాంబిక ఆలయం వద్ద పాదాలకు పూజలు చేస్తున్న జెడ్పీటీసీ లక్ష్మీరమణమ్మ తదితరులు



ప్రత్యేక అలంకరణలో కేజేపురం నూకాంబిక, చీడికాడ నూకాలమ్మ అమ్మవార్లు

బుచ్చెయ్యపేట : మండల కేంద్రం బుచ్చెయ్యపేట, వడ్డాది, ఆర్.భీమవరం, పెదపూడి, తురకలపూడి, విజయరామరాజుపేట, బంగారుమెట్ట, దిబ్బిడి, కేపీ అగ్రహారం తదితర గ్రామాల్లో శనివారం నూకాలతల్లిని భక్తులు దర్శించుకున్నారు. పలు గ్రామాల్లో యువకులు భక్తులకు ఉచితంగా ప్రసాదాలు, మజ్జిగ, మంచినీళ్లు అందించారు.


కె.జె.పురంలో నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గొలుగొండ: లింగంపేట నూకాలమ్మతల్లి జాతర శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ కమిటీ చైర్మన్ కొడమంచిలి వరలక్ష్మి తో పాటు కమిటీ సభ్యులు భక్తులకు సదుపాయాలు కల్పించారు. శనివారం రాత్రి 12 గంటల వరకు లింగంపేటలో సంబరాలు అనంతరం గుడి తలుపులు సోమవారం ఉదయం వరకు మూత వేస్తున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం నుంచి తిరిగి భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. తొమ్మిది రోజుల పాటు తీర్థమహోత్సవాలు నిర్వహిస్తారు.

చీడికాడ: కొత్త అమావాస్య పర్వదినం సందర్భంగా చీడికాడ,తంగుడుబిల్లి,చినగోగాడ తదితర గ్రామాల్లో నూకాంబిక అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చీడికాడలో, తంగుడుబిల్లిలో గ్రామస్తుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది.

నాతవరం : మండలంలో జిల్లేడుపూడి నూకాలమ్మ పండగ ఘనంగ నిర్వహించారు. వేలాదిగా భక్తులు తరలిరావడంతో డి.యర్రవరం జంక్షన్ నుంచి జిల్లేడుపూడి నూకాలమ్మ ఆలయం వరకు సుమారుగా 4కిలోమీటర్లు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు మండుటెండలో గంటలు తరబడి నిరీక్షణ చేశారు. ఆలయ ప్రాంగణలో భజనలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు తాగునీరు తీర్థ ప్రసాదాలు ఉచితంగా పంపిణీ చేశారు. నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, నాతవరం ఎస్ఐ భీమరాజు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


మాడుగులలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


వడ్డాదిలో అమ్మవారిని దర్శించికుంటున్న భక్తులు


లింగంపేటలో పోతు గరగ కలుస్తున్న దృశ్యం


జిల్లేడుపూడిలో నూకాలమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

మానసిక రోగి విశాఖలోని ఆస్పత్రికి తరలింపు


మానసిక రోగిని ఆస్పత్రికి తీసుకెళ్తున్న బ్రహ్మేంద్ర

దేవరాపల్లి: దేవరాపల్లిలో గత రెండేళ్లుగా సంచరిస్తున్న మానసిక రోగిని ఇదే గ్రామానికి చెందిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి గొరస బ్రహ్మేంద్ర చొరవ తీసుకొని విశాఖలోని మానసిక ఆస్పత్రికి అతి కష్టం మీద శనివారం తరలించారు. హిందీలో మాట్లాడుతూ తన పేరు అడ్రస్ సైతం చెప్పలేని స్థితిలో ఉన్న 45 ఏళ్ల మానసిక రోగి దేవరాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలలో సంచరిస్తున్నాడు. కొందరు మానవతావాదులు ఆహారాన్ని అందించి ఆకలి తీర్చేవారు. అతనిని అధికారుల సహకారంతో బ్రహ్మేంద్ర తన సొంత ఖర్చులతో విశాఖ మానసిక రోగుల ఆస్పత్రిలో శనివారం చేర్పించారు.

ఫ్యాప్టో జిల్లా కార్యవర్గం ఎన్నిక

అనకాపల్లి టౌన్: పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఫ్యాప్టో (ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బోయిన చిన్నారావు, కార్యదర్శిగా యేశపోగు సుధాకర్ రావు, కోశాధికారిగా కేఎస్ఎస్ సాయి ప్రసాద్, కో చైర్మన్లుగా జీఎస్ చక్రవర్తి, జాకబ్ రవీంద్రబాబు, డిప్యూటీ సెక్రటరీలుగా గొంది చిన్నబ్బాయ్, ఆచంట రవి, ఎస్ దుర్గాప్రసాద్, వై జానకిరామ్ నాయుడు ఎన్నికయ్యారు.

నవోదయకు ఎంపికైన విద్యార్థినికి అభినందనలు


దక్షితా శ్రీకి స్వీటు తినిపిస్తున్న తండ్రి రామకృష్ణ

చీడికాడ : నవోదయకు ఎంపికై సీటు సాధించిన బైలపూడికి చెందిన గొల్లవిల్లి దీక్షితాశ్రీని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, యువజన విభాగం అధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాంలు అభినందించారు. గ్రామానికి చెందిన గొల్లవిల్లి రామకృష్ణ, రమణ దంపతులు కుమార్తె అయిన దీక్షితాశ్రీ వడ్డాదిలో ఒక ప్రైవేట్ పాఠశాలలో చదువుతూ నవోదయ పరీక్ష రాసిందన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరచడంతో ఆమెకు మొదటి జాబితాలో సీటు సాధించిందని తల్లిదండ్రులు చెప్పారు. ఈ మేరకు దీక్షితాశ్రీని వారు అభినందించారు.

అశోక్‌కు ఘన సన్మానం


అశోక్‌ను సన్మానిస్తున్న కంచిపాటి జగ్గారావు

రావికమతం : జాతీయ స్థాయిలో నిర్వహించిన గేట్ ఫలితాల్లో 12వ ర్యాంక్ సాధించిన అమ్మిరెడ్డి అశోక్‌ను మండలంలో గల యువకులు అందరూ ఆదర్శంగా తీసుకోవాలని మాజీ సర్పంచ్ కంచిపాటి జగ్గారావు అన్నారు. ఈ సందర్భంగా అశోక్‌ను జగ్గారావుతో పాటు మర్రివలస ఎంపీటీసీ సభ్యులు ఎలిశెట్టి లోవరాజు శాలువాతో ఘనంగా సన్మానించారు.

వాటర్ ఫిల్టర్ విరాళం


కె.జె.పురం వెంకటేశ్వర స్వామి ఆలయంలో వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న రామకొండలరావు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయానికి దాత సహకారంతో వాటర్ ఫిల్టర్‌ను శనివారం అందజేశారు. వేసవి దృష్ట్యా ఆలయంలో భక్తుల కోసం స్థానిక జలమూరి మోహన్‌రావు, వరలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో వాటర్ ఫిల్టర్‌ను బహూకరించారు. దీనిని ఆలయ కమిటీ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు ప్రారంభించారు. కమిటీ ఉపాధ్యక్షుడు అప్పలనాయుడు, మండల వీహెచ్‌పీ కోశాధికారి పరిమి కాసుల జగ్గారావు పాల్గొన్నారు.

రైవాడలో భారీ గిరి నాగు కలకలం


గిరి నాగును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్

దేవరాపల్లి: రైవాడలో శనివారం భారీ గిరి నాగు హల్‌చల్ చేసింది. గ్రామంలోని ఓ ఇంటి సమీపంలోకి సుమారు 15 అడుగుల గిరి నాగు ప్రవేశించడంతో ఒక్కసారిగా స్థానిక ప్రజలు హడలెత్తిపోయారు. ఇళ్లల్లో నుండి ప్రాణ భయంతో బయటకు పరుగులు తీశారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న స్నేక్ క్యాచర్ సుమారు గంటకు పైగా శ్రమించి అతి కష్టం మీద పట్టుకున్నారు. దీంతో స్థానిక ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం దేవరాపల్లి శివారు ఒడ్డు చింతల కల్లాల్లోని పంట పొలాల్లో భారీ గిరినాగు రైతులను బెంబేలెత్తించగా, తాజాగా రైవాడలో మరో గిరినాగు కనిపించడంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.

ఒకేషనల్ పరీక్షకు 196 మంది గైర్హాజరు

అనకాపల్లి టౌన్: జిల్లాలో పదో తరగతి ఒకేషనల్ ఎడ్యుకేషన్ పబ్లిక్ పరీక్షకు 196 మంది విద్యార్థులు హాజరు కాలేదని డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు శనివారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 29 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 4,999 మంది విద్యార్థులకుగాను 4,803 మంది హాజరయ్యారన్నారు.

మాజీ జెడ్పీటీసీ మృతికి సంతాపం


శేషుకుమార్ (ఫైల్)

మాకవరపాలెం: అనారోగ్యంతో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రుత్తల శేషుకుమార్ (47) మృతి చెందారు. మండల కేంద్రంలో నివసిస్తున్న శేషుకుమార్ గత కొంత కాలంగా కాలేయ సమస్యతో బాధపడుతున్నారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి విశాఖలో మృతి చెందారు. శేషుకుమార్ మాకవరపాలెం సర్పంచ్‌గా, జెడ్పీటీసీగా, ఉప సర్పంచ్‌గా పనిచేశారు. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో భాగంగా నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా శేషుకుమార్‌ను ప్రకటించింది. ఆ పదవి పొందకుండానే మృతి చెందారు. ఆయన మృతదేహానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్, నర్సీపట్నం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు, ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు నివాళులర్పించి సంతాపం తెలియజేశారు. పార్టీలకతీతంగా మండలవ్యాప్తంగా భారీఎత్తున జనం తరలి వచ్చి అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

కార్పొరేషన్ల ఇంటర్వ్యూలకు 585 దరఖాస్తులు


ఇంటర్వ్యూలు చేస్తున్న ఎంపీడీవో వెంకన్నబాబు

రావికమతం : వివిధ కార్పొరేషన్‌ల ద్వారా రాయితీపై రుణాలు మంజూరుకు శనివారం నిర్వహించిన ఇంటర్వ్యూలు వెలవెల పోయాయి. బీసీ కార్పొరేషన్ ద్వారా 33 మంది వెనుకబడిన వర్గాలకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు,కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు వివిధ కార్పొరేషన్ల ద్వారా రాయితీపై రుణాలకు మండలానికి 31 కోట్ల 8 లక్షల రూపాయల సబ్సిడీ ప్రభుత్వం కేటాయించింది. రాయితీపై రుణాలు పొందేందుకు 585 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకన్నబాబు, బ్యాంక్ మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 70 మంది మాత్రమే ఇంటర్వ్యూకు హాజరయ్యారు.

మెగా జాబ్‌మేళాకు స్పందన

కె.కోటపాడు : కె.కోటపాడులో ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో శనివారం అయ్యన్న డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగులకు 17 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు జరిపారు.

చురుగ్గా ఈకేవైసీ కార్యక్రమం

మాడుగుల రూరల్: ప్రతి రేషన్ కార్డుదారు తప్పనిసరిగా ఈకైవైసీ చేయించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో గ్రామాల్లో రేషన్ డిపో డీలర్లు ఈకైవేసీ చేయిస్తున్నారు. రేషన్‌కార్డులో వున్న ప్రతి ఒక్కరూ విధిగా ఈ నెల 31 వ తేదీ లోపు చేయించుకోవాలని, లేకపోతే వచ్చే నెల నుంచి ఈ ప్రక్రియ చేయించుకోని వారికి రేషన్ నిలుపుదల చేస్తారని తెలిపారు. కాగా ఈకైవేసీ గడువును వచ్చే నెల వరకు పెంచారని వాట్సప్‌లో వస్తున్న వార్తలు నమ్మవద్దని మండల సీఎస్‌డీటీ ఈశ్వరరావు శనివారం సాక్షికి తెలిపారు.

ఉపాధి పనుల నిర్వహణ ఇలాగేనా..!



బుచ్చెయ్యపేట ప్రజావేదికలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాంబాబు

అధికారులపై జెడ్పీటీసీ ఆగ్రహం

బుచ్చెయ్యపేట : జాతీయ ఉపాధి హామీ పథకం పనుల పట్ల ఆ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని జెడ్పీటీసీ దొండా రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో 2023 ఏప్రిల్ 1 నుంచి గత ఏడాది మార్చి 31 వరకు జరిగిన రూ. 16,09,69,386 ఉపాధి పనుల నిధులపై సోషల్ ఆడిట్ ప్రజా వేదిక సభ జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ పలు గ్రామాల్లో ఏఏ పనులు ఎంత మేర చేస్తున్నారో, ఎంత నిధులు ఖర్చు చేస్తున్నారో నేమ్ బోర్డులతో పాటు కనీసం ప్రజా ప్రతినిధులకు తెలియకుండా పనులు చేస్తున్నారని అధికారులపై మండిపడ్డారు. దీనిపై జిల్లా అధికారులు దృష్టికి తీసి కెళ్తామన్నారు. గంటికొర్లాం వీఆర్పీ దొంగ మస్టర్లు వేసి అక్రమ పద్ధతిలో ప్రభుత్వ నిధులు డ్రా చేస్తున్నట్టు మాజీ సర్పంచ్ శనివాడ నాయుడుబాబు పీడీకి ఫిర్యాదు చేశారు. ఐదేళ్ల కాలంలో గ్రామంలో చేసిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తే లక్షలాది రూపాయల అవినీతి బయట పడుతుందని తెలపగా విచారణ చేయిస్తామని అధికారులు తెలిపారు. చిన అప్పనపాలెంలో చేసిన పనులకు నేమ్ బోర్డులు పెట్టకపోవడంతో పాటు పలు గ్రామాల్లో చేసిన పనుల వివరాలు పెట్టకపోవడం, నాటిన మొక్కల వివరాలు సక్రమంగా లేకపోవడంతో నిధులు పక్కదారి పట్టినట్టు అధికారులు గుర్తించారు. విచారణ చేయించి నిధులు రికవరీ చేయిస్తామని ప్రకటించారు. డ్వామా పీడీ పూర్ణమదేవి, జిల్లా విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి,ఎంపీడీవో విజయలక్ష్మి, ఏపీవో వరహాలబాబు పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యలపై విజ్ఞప్తి



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరమణ

రావికమతం : చీమలపాడు పంచాయతీ కొండ శిఖర అదివాసీ గిరిజన గ్రామం జీలుగులోవలో రెవిన్యూ అధికారులు శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని (సివిల్ రైట్స్) నిర్వహించారు. తహసీల్దార్ వెంకటరమణ, ఆర్ఐ సతీష్, వీఆర్వో సింహాద్రి, ఎత్తయిన కొండలు, గుట్టలు దాటుకుని కాలినడకన జీలుగులోవకు వెళ్లి అక్కడి అదివాసీలతో సమావేశం నిర్వహించి వారి సమస్యలు తెలుసుకున్నారు. గిరిజనులు పలు సమస్యలను తహసీల్దార్‌కు వివరించారు. కొర్రా చిలుకమ్మ, సిదిరి చిలుకమ్మ మాట్లాడుతూ తమకు పింఛన్ రావడం లేదని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య సేవలు అందలేదని, ఉపాధి పనులు లేవని గ్రామస్తులు విన్నవించారు. వారి సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

బడికి, ఆస్పత్రికి దగ్గరలో మద్యం దుకాణమా?

విజయరామరాజుపేటలో ఆందోళన



విజయరామరాజుపేటలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

బుచ్చెయ్యపేట : విజయరామరాజుపేట గ్రామంలో అంబేడ్కర్ సంఘం దగ్గరలో ఏర్పాటు చేస్తున్న మద్యం షాపునకు అనుమతి ఇవ్వొద్దని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఇటీవల కొత్తగా గీత కార్మికులకు మంజూరైన మద్యం షాపును విజయరామరాజుపేటలో ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మద్యం షాపు ఏర్పాటుకు గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం, డ్వాక్రా సంఘ సభ్యులు అభ్యంతరం తెలిపారు. పాఠశాలకు, అంబేడ్కర్ యువజన సంఘం, అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య కేంద్రానికి దగ్గరలో వైన్ షాపు ఏర్పాటు వల్ల విద్యార్థులకు, పిల్లలకు, మహిళలకు ఇబ్బందులు ఎదురౌతాయని గ్రామానికి దూరంగా మద్యం షాపు ఏర్పాటు చేయాలని శనివారం సాయంత్రం ఆందోళనకు దిగారు. గ్రామస్తులు నేతల రమణమ్మ, దొండా నాగమణి, డి. వెంకటరావు తదితరులు మద్యంషాపును అనుమతించవొద్దని చోడవరం ఎక్సైజ్‌శాఖ సీఐ, ఎస్ఐలకు వినతి పత్రం అందించారు.

బాలలతో పనిచేయించడం నేరం



షాపు తనిఖీ చేస్తున్న అధికార బృందం

నర్సీపట్నం : కార్మికశాఖ ఆధ్వర్యంలో అధికారులు నర్సీపట్నంలో పలు షాపుల్లో బాల కార్మికుల గుర్తింపునకు శనివారం తనిఖీలు నిర్వహించారు. 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోకూడదని జిల్లా బాలల సంరక్షణ ప్రతినిధి డి.లోవరాజు యజమానులకు వివరించారు. మా తనిఖీల్లో బాల కార్మికులు దొరికితే సంబంధిత షాపు, హోటల్ యాజమానిపై కేసులు పెడతామని హెచ్చరించారు. సీడీఎస్‌పీ చైతన్య, సీఐ గోవిందరావు, ఐసీడీఎస్ ప్రతినిధి రూప, కానిస్టేబుల్ నాగరత్నం, మహిళా పోలీసు నికిత పాల్గొన్నారు.

శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు - Advt Feature

నేడు నూకాంబిక ఆలయ ప్రారంభోత్సవం



చౌడువాడలో నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

కె.కోటపాడు : మండలంలో కె.కోటపాడు, గొండుపాలెం, గొంపవానిపాలెం, చౌడువాడ, దాలివలస, గొట్లాం గ్రామాల్లో నూకాలమ్మ అమ్మవారికి ఘనంగా పూజలు జరిపారు. కె.కోటపాడులో నూకాంబికా అమ్మవారిని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, శ్రీకాంత్ శ్రీను, చౌడువాడలో విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, గొట్లాంలో మాజీ పీఏసీఎస్ డైరక్టర్ కోట్యాడ అప్పారావు తదితరులు నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గొండుపాలెంలో మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు. మాజీ సర్పంచ్ రామస్వామిపాత్రుడు పాల్గొన్నారు. ఆనందపురం గ్రామంలో నూతనంగా నిర్మాణం జరిపిన నూకాంబికా అమ్మవారి ఆలయాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను శనివారం సాయంత్రం నుంచి ప్రారంభించారు. ఆలయ ప్రారంభోత్సవం అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన జరపనున్నట్టు సర్పంచ్ అప్పాజి తెలిపారు.

శ్రీరామ నవమి ఉత్సవాలకు ముస్తాబు



కె.జె.పురం రామాలయంలో రంగులు వేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: శ్రీరామ నవమి ఉత్సవాలుకు కె.జె.పురం రామాలయంను ముస్తాబు చేస్తున్నారు. దాతలు సహకారంతో ఆలయం అంతా పాలగచ్చులు చేశారు. గుడికి పూర్తి స్థాయిలో రంగులు వేశారు. వచ్చే నెల 6 వ తేదిన శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు స్దానికులు పేర్కొన్నారు. ఆలయం ముందు భాగంలో ప్రభుత్వ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు.

నేటి నుంచి నవమి ఉత్సవాలు : శ్రీరామ నవమి ఉత్సవాలు ఉగాది పర్వ దినం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఉగాది పచ్చడి పంపిణీ, సాయంత్రం పంచాగ శ్రవాణం నిర్వహించనున్నట్టు గ్రామస్తులు తెలిపారు.

ఉగాది వేడుకలకు ముస్తాబైన ఆలయాలు

- చోడవరం ప్రసన్నభారతి ఆధ్వర్యంలో ఉగాది పంచాంగ శ్రవణం



ఉగాది వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చోడవరం: ఉగాది వేడులు ఈనెల 30వ తేదీన నిర్వహించేందుకు అన్ని చోట్ల ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే చోడవరం ప్రాంతంలో ప్రముఖ దేవాలయాలన్నీ రంగురంగుల పూలు, విద్యుత్ అలంకరణలతో సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, సాయంత్రం పండిత సత్కారం, పంచాగ శ్రవణం ఏర్పాటు చేశారు. చోడవరం ప్రసన్నభారతి ఆధ్వర్యంలో ప్రేమసమాజం ఆవరణంలో పంచాగం శ్రవణం, ప్రముఖ రచయితలు, కవులకు సత్కారంతో వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. స్ధానిక బ్రాహ్మణ భవనంలో ఉగాది వేడుకలు జరపనున్నారు.

తూటిపాలలో ఉగాది వేడుకలు

మాకవరపాలెం: తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం ఉగాది పచ్చడిని తయారు చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. విశ్వావసు నామ సంవత్సరానికి శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది విశిష్టతను పాఠశాల హెచ్ఎం కె.రాము విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు లోవరాజు, సంతోషి పాల్గొన్నారు.

పంతాలు, పట్టింపులు నష్టదాయకం



ఇరువురికి కౌన్సెలింగ్ చేస్తున్న అధికారులు

నాతవరం : పంతాలు పట్టింపులకు పోయి ప్రతి చిన్న విషయానికి రాద్ధాంతం చేసుకుంటే నష్టపోయేది మీరే అన్న విషయాన్ని గ్రహించాలని తహసీల్దార్ వేణుగోపాల్ అన్నారు, మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పీజీఆర్ఎస్ దరఖాస్తులకు సంబంధించి ఫిర్యాదుదారులతో సమావేశం నిర్వహించారు. ఇరువర్గాలకు కౌన్సెలింగ్ చేశారు. భూ సమస్యలకు సంబంధించి కొండ దర్శవరం, మర్రిపాలెం, ములగపూడి, బెన్నవరం, జిల్లేడుపూడి గ్రామాల నుంచి అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. నిబంధనల ప్రకారం క్షేత్ర స్థాయిలో వాస్తవాలను పరిశీలించి ఇరువురికి న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి డిప్యూటీ తహసీల్దార్ టి.వి.ఎల్ రాజు సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అంకితభావం అభినందనీయం



దేవరాపల్లిలో పంచాయతీ కార్యదర్శి లింగన్న దంపతులను సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

దేవరాపల్లి: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన వారికి ఉద్యోగ విరమణ అనంతరం కూ డా సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని స్థానిక ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అన్నారు. ఈ మేరకు ఈ నెలాఖరుతో ఉద్యోగ విరమణ చేయనున్న ముషిడిపల్లి పంచాయతీ కార్యదర్శి లెక్కల లింగన్నకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎల్‌డీవో, మండల ప్రత్యేక అధికారి ఎస్.మంజులవాణి, రిటైర్డ్ ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు తదితరులు హాజరై లింగన్న దంపతులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. విధి నిర్వహణలో లింగన్న సేవలను కొనియాడారు.